వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 82
పేజీలు : 08 | వెల: రూ.5/-

శనివారం
డిసెంబర్ 14, 2024

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




2లో..

## సీఎంకు అహంకారం ఎక్కువ.. అనుభవం తక్కువ

- అప్పు అంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం
- హామీలు అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్
- బీఆర్ఎస్ పార్టీ సభాపక్ష నేత మధుసూదనా చారి



వివరాలు2లో..

# బాబోయ్.. తహసీల్దార్ ఆఫీస్







- శిథిలావస్థలో వరంగల్ కార్యాలయం
- పాక్షికంగా దెబ్బతిన్న గదులు
- ప్రమాదపుటంచుల్లో ప్రభుత్వ ఉద్యోగులు
- బిక్కు బిక్కు మంటూ పని చేస్తున్న సిబ్బంది
- గతంలో నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు
- పిల్లర్లు వేసి వదిలేసిన కాంట్రాక్టర్

వరంగల్ మహా నగర పాలక సంస్థ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఉన్న వరంగల్ తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. నిజాం కాలంలో నిర్మించినట్లు చెబుతున్న ఈ భవనానికి ఎలాంటి పిల్లర్లు లేకపోవడంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే కార్యాలయంలోని పలు గదులు పాక్షికంగా దెబ్బతిన్నాయి. దీంతో ఆయా గదుల్లోకి ఎవ్వరూ వెళ్లకుండా తాళాలు వేశారు. స్లాబు పెచ్చులు ఊడి పడుతుండడంతో కార్యాలయంలోకి వెళ్లాలంటేనే సిబ్బంది జంకుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటేచాలు స్లాబుతోపాటు గోడలన్నీ పచ్చిగా మారి భయానక పరిస్థితిని తలపిస్తోంది. అయితే శిథిలావస్థకు చేరిన తహసీల్దార్ కార్యాలయానికి నూతన భవనం నిర్మించాలని పదిహేను సంవత్సరాల క్రితమే ప్రతిపాదనలు సిద్ధం చేయడంతోపాటు పిల్లర్లు కూడా వేసిన కాంట్రాక్టర్ తర్వాత చేతులెత్తేయడంతో పనులు పెండింగ్ లో పడ్డాయి. అప్పటినుంచి ఇప్పటివరకు వరంగల్ తహసీల్దార్ కార్యాలయానికి నూతన భవన నిర్మాణ ప్రతిపాదనలు చేయకపోవడం గమనార్హం.

- వరంగల్ వాయిస్, బ్యూరో



8లో..

## ముకుందా జ్యువలరీ ప్రారంభం

ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని



8లో..

## డైట్, కాస్మెటిక్ చార్జీలు పెంచిన ఘనత మాదే

- మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిల్ల శ్రీధర్ బాబు
- విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు



2లో..

## చదువుతోపాటు నైపుణ్యం అవసరం

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- ఘనంగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ 11వ వార్షికోత్సవం



8లో..

## ఘనంగా అయ్యప్ప పడిపూజ

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

శనివారం, డిసెంబర్ 14, 2024



# బాబోయ్.. తహసీల్దార్ ఆఫీస్

- శిథిలావస్థలో వరంగల్ కార్యాలయం
- పాక్షికంగా దెబ్బతిన్న గదులు
- ప్రమాదపుటంచుల్లో ప్రభుత్వ ఉద్యోగులు
- బిక్కు బిక్కు మంటూ పని చేస్తున్న సిబ్బంది
- గతంలో నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు
- పిల్లర్లు వేసి వదిలేసిన కాంట్రాక్టర్

**వరంగల్ వాయిస్, బ్యూరో :** వరంగల్ తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. స్లాబు పెచ్చులు ఊడుతున్నాయి. గోడలు పగుళ్లు పట్టాయి. చిన్నపాటి వర్షానికే కార్యాలయం మొత్తం జలమయంగా మారుతోంది. కార్యాలయం భవనం గోడలను చీల్చుకుంటూ పెరిగిన మ్రాను అత్యంత ప్రమాదకరంగా మారింది. గోడలు కూడా పెచ్చులూడుతూ ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. నిత్యం ప్రజల్లో ఉంటూ వారిరి రక్షణ కల్పిస్తున్న రెవెన్యూ ఉద్యోగులకే రక్షణ లేని పరిస్థితి నెలకొంది.

### బిక్కుబిక్కుమంటూ..

వరంగల్ తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. అదే విధంగా నిత్యం వివిధ పనులమీద ఇక్కడికి వచ్చే వారు కార్యాలయాన్ని చూడగానే అమ్మ బాబోయ్ అనే పరిస్థితి నెలకొంది. అందులో అడుగు పెట్టాలంటేనే వెన్నులో వనుకు ప్రారంభమవుతోంది. ఎప్పుడు ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోనన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. కార్యాలయంలోని పలు గదులు ఇప్పటికే పాక్షికంగా కూలిపోయాయి. అయితే కూలిపోయిన గదులకు తాళం వేస్తూ పక్కనున్న ఇతర గదులను వినియోగించుకుంటున్నారు.

### అటకెక్కిన నూతన భవనం..

నిజాం కాలం నాటి భవనంగా గుర్తింపు పొందిన భవనంలో పురాతన భవనంలో గత కొన్ని సంవత్సరాలుగా వరంగల్ తహసీల్దార్ కార్యాలయం పనిచేస్తుంది. అయితే పదిహేను సంవత్సరాల క్రితమే ఈ భవనం శిథిలావస్థకు చేరుకుందని గ్రహించిన ప్రభుత్వం దీని వెనుకాలే ఖాళీగా ఉన్న స్థలంలో నూతన భవనం నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి టెండర్లు కూడా పూర్తి చేసింది. అయితే పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ వడివడిగా పనులు ప్రారంభించారు. పిల్లర్ల నిర్మాణం కూడా పూర్తయింది. తర్వాత ఏమైందో గాని పనులను మధ్యంతరంగా నిలిపివేశారు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వరంగల్ తహసీల్దార్ కార్యాలయానికి నూతన భవనం నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

### కార్యాలయం చుట్టూ చెత్త.. చెదారం..

వరంగల్ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ చెత్తా చెదారం పేరుకుపోయింది. వెనుకవైపు గుబురుగా చెట్లు పెరిగి చిన్నపాటి వనాన్ని తలపిస్తోంది. రాత్రి సమయంలో కార్యాలయానిక ఉన్న గేటుకు తాళం వేస్తున్నారు. అయినప్పటికీ ఐఎంఏ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చేలా దొడ్డి దాడి ఉన్నందున పలువురు ఆకతాయిలు రాత్రి పూట ఈ దారిగుండా కార్యాలయ ఆవరణలోకి ప్రవేశించి మద్యం సేవిస్తున్నట్లుగా ప్రచారం సాగుతోంది. కార్యాలయం వెనుక గుబురుగా పెరిగిన మొక్కలు ఉన్నందున పాములు, తేళ్లు కార్యాలయంలోకి వస్తున్నట్లు పలువురు వెల్లడించారు. అయితే చెత్తను తొలగించడంలో కార్యాలయం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం.











## చదువుతోపాటు నైపుణ్యం అవసరం

**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** ప్రతీ విద్యార్థికి చదువుతో పాటు నైపుణ్యం కూడా ఉండాలని అప్పుడే ఏ రంగంలో అయినా రాణించగలరని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాలలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వరంగల్ 11వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం కడియం శ్రీహరి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో మెరుగైన విద్య అందించాలని 10ఏళ్ల క్రితం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ను ప్రారంభించారని ఈ సందర్భంగా ఢిల్లీ పబ్లిక్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ గోపాల్ రెడ్డి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ రాజీ రెడ్డి, వైస్ చైర్మన్ రవి కిరణ్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఇన్నారెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## సీఎంకు అహంకారం ఎక్కువ.. అనుభవం తక్కువ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సీఎంకు అహంకారం ఎక్కువ, అనుభవ తక్కువ అని శాసనమండలిలో బీఆర్ఎస్ పార్టీ సభాపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనా చారి ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంలో రాష్ట్ర అప్పు రూ.6.70 లక్షలు అని పేర్కొని, ప్రచారం మాత్రం రూ.7 లక్షల కోట్లు అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. శనివారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్ తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదనా చారి మాట్లాడుతూ 6 గ్యారెంటీలు, 420 హామీలు నెరవేర్చలేకే కాంగ్రెస్ నాయకులు అప్పు అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. హామీలు అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతల్లో హామీలు అమలు చేయాలన్న చిత్తశుద్ధి లేదన్నారు. పదేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడే నాటికి ఆర్బీఐ హాండ్ బుక్ ఆఫ్ ఇండియా ప్రకారం రూ.72,658 కోట్ల అప్పును నాటి ప్రభుత్వం స్వీకరించిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే రూ.15,118 కోట్ల అప్పు చేసిందని దుయ్యబట్టారు. నేడు అది రూ.80 వేల కోట్లు దాటిందన్నారు. స్థూలంగా తెలంగాణ రాష్ట్ర మొత్తం అప్పు 4,28,540 కోట్లలో గత పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ చేసిన అప్పు 3,28,499 కోట్లు మాత్రమే అన్నారు.

### ప్రగల్భాలు, ప్రేలాపనలు..

కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనలో కూల్చివేతలు, ప్రేలాపనలు, ప్రగల్భాలు తప్ప చేసిందేమీ లేదని మధుసూదనా చారి ఆరోపించారు. రాష్ట్రంలోని ఏ ఒక్క వర్గానికి కూడా కాంగ్రెస్ న్యాయం చేయలేదన్నారు. రాష్ట్రంలో రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి కాలేదని, రైతుబంధు బంద్రైందన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే జైల్లో వేస్తాము అనే ధోరణిలో రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యవహార శైలి ఉందన్నారు. రైతు హీర్యా నాయక్ చేతులకు బేడీలు వేసిన ఘనత కాంగ్రెస్ దే అన్నారు.

### ప్రశ్నిస్తాం.. ఎదురిస్తాం..

ప్రజలకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని మధుసూదనా చారి హెచ్చరించారు. ప్రజలకు అండగా నిలిచి ప్రశ్నిస్తాం..ఎదురిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వాస్తవాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. గ్యారెంటీలు, హామీలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే వరకు పోరాడుతామన్నారు. రేవంత్ రెడ్డి ప్రేలాపనలు పేలుతున్నారని ఆరోపించారు. అయితే ప్రజలకు కావాల్సింది పథకాలు, ఫలాలు, ఫలితాలు మాత్రమే అని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రజలు మోసపోయామని గమనించారన్నారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకుని ప్రజలకు మంచి చేయండి లేదంటే ప్రజలే సరైన సమయంలో గుణపాఠం చెబుతారన్నారు. ఈ సమావేశంలో నాయకులు జనార్ధన్ గౌడ్, మాలకుమ్మరి పరుశురాములు, మోడెం ప్రవీణ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ఉన్నత ప్రమాణాలతో కార్పొరేట్ స్థాయి విద్య

## ➲ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య బోధన, నాణ్యత పరమైన భోజన సదుపాయాలను ప్రజా ప్రభుత్వం కల్పిస్తుందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు నేతృత్వంలో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా కాజీపేట 63వ డివిజన్ బీసీ బాలుర వసతి గృహం, హంటర్ రోడ్డులోని మైనారిటీ బాలికల వసతి గృహాలలో రాష్ట్ర ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలలలో పెంచిన 40 శాతం చార్జీలను అమలును ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ఆశ్రమ పాఠశాలను తనిఖీలు చేశారు. భోజన శాల, తరగతి గదులను పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత వసతి గృహాలలో చదువుకుంటున్న విద్యార్థులకు గత 16 సంవత్సరాల నుంచి ఉన్నటువంటి కాస్మెటిక్ చార్జీలను 200 శాతం పైగా పెంచడం జరిగిందన్నారు. అన్ని వసతి గృహాలు, గురుకుల విద్య సంస్థలలోని విద్యార్థిని విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత అవసరాలను అలాగే పేద, సామాజిక, ఆర్థిక నేపథ్యాల విద్యార్థుల పోషకాహార అవసరాలను తీర్చడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించిందన్నారు. ప్రపంచ స్థాయి విద్య, పాఠ్యేతర మౌలిక సదుపాయాలను అందించడంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ కాంప్లెక్స్ ఏర్పాటు వంటి వినూత్న కార్యక్రమాలు చేపట్టి విద్యార్థుల అభివృద్ధికై నిబద్ధతను చూపించడం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా ఏకరీతి ఆహార ప్రణాళికను ఏర్పాటు చేయడం, డైట్ తయారీ, సర్వింగ్ మెథడాలజీ ప్రమాణీకరణ చేపట్టి తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి మారుమూల వసతి గృహాలు, గురుకుల విద్య సంస్థలలోని విద్యార్థిని విద్యార్థులకు పోషక విలువలతో కూడిన రుచికరమైన ఆహారాన్ని అందించడం లక్ష్యంగా పెట్టుకుందని ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు. స్టోర్ లే అవుట్ కిచెన్ ఫ్లోర్ మేనేజ్ మెంట్ ప్రొవిజన్ ప్రొక్యూర్మెంట్, డిస్ట్రిబ్యూషన్ తో పాటు డైనింగ్ ఏరియా, మేనేజ్ మెంట్, ఫుడ్ సర్వింగ్ ప్రాక్టీస్ ల ప్రమాణీకరణ వంటివి ఆహార సరఫరా నాణ్యతను నిర్ధారిస్తుందన్నారు. అనంతరం మైనారిటీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమాలలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, వారి తల్లితండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా దత్తాత్రేయుడి జయంతి వేడుకలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బ్రహ్మ విష్ణు మహేశ్వరుల త్రిరూపమైన దత్తాత్రేయుని జయంతి వేడుకలు శనివారం హనుమకొండ సాయిబాబా మందిరంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ పూజారులు కిషోర్ శర్మ, మణిశర్మలు మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకంతో పాటు అర్చన, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్న హారతి అనంతరం మందిరంలో ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని భక్తి ప్రసాదాలను ఆ దత్త స్వరూపమైన సాయినాధుని ప్రసాదాన్ని ఆరగించారు. మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ కార్యక్రమాలను పర్యవేక్షించగా మందిర ధర్మకర్తలు నిమ్మల శ్రీనివాస్, రాకం సదానందం, వేము గండ్ల రమేష్, డాక్టర్ పూస సురేష్ కుమార్ లతో పాటు మందిర సిబ్బంది రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం సంధ్య హారతితో పాటు పల్లకి సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించగా తేజ హారతితో దత్తాత్రేయని జయంతి వేడుకలు ఘనంగా ముగిశాయి.

# ఇందిరమ్మ రాజ్యం.. ఇంటింటా సౌభాగ్యం



**వరంగల్ వాయిస్, పరకాల :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లను పరకాల పట్టణంలో ఒకటో వార్డులో శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశానుసారం సర్వే చేపట్టారు. కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్ మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలు ప్రజా పాలనలో సమర్పించిన దరఖాస్తు ఆధారంగా వార్డు ఆఫీసర్ ఇందిరమ్మ యాప్ ద్వారా సర్వే చేపట్టడం జరుగుతుంది. ఇందిరమ్మ పథకం కింద పూర్తి సాయి అర్హత గల నిరుపేద కుటుంబాలకు ఇండ్లను అందజేసే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. వార్డులోని వారు ఇంటి పన్ను నల్ల పన్ను, కరెంట్ బిల్లు, ఇంటి స్థలం పేపర్లు తగిన వివరాలు అందజేయాలని కోరారు.

# దుప్పట్ల పంపిణీ



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశానుసారం శనివారం తొర్రూరు పట్టణ కేంద్రంలోని పలు వార్డులలో నివసించే నిరుపేద కుటుంబాలకు ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా దుప్పట్ల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తొర్రూరు మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, మాజీ జడ్పీటీసీ, జిల్లా ఫ్లోర్ లీడర్ మంగళంపల్లి శ్రీనివాస్, మాజీ మండల ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీనివాస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎన్నమనేని శ్రీనివాసరావు, కర్నె నాగరాజు, పేర్ల జంపా రాయిశెట్టి వెంకన్న, భూసాని ఉప్పలయ్య, మహంకాళి భూపతి, కుమారస్వామి, తేరాల సోమన్న, ఎల్లయ్య, అశోక్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

# బాసని చంద్ర ప్రకాష్ కు సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అఖిల భారత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు డాక్టర్ లయన్ ఆడెపు రవీందర్ నేత ఆధ్వర్యంలో రాష్ట్ర వెజ్ కమిటీ మెంబర్ గా ఎన్నికైన పద్మశాలి ముద్దుబిడ్డ బాసని చంద్ర ప్రకాష్ ను శాలువా బొకేతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల అఖిల భారత పద్మశాలి సంఘం కోఆర్డినేటర్ వద్నాల నరేందర్ నేత, 23వ డివిజన్ అఖిల భారత పద్మశాలి సంఘం ప్రెసిడెంట్ మంత్రి కమలాకర్ నేత, 12వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాసాని కరుణాకర్ నేత టీపీసీసీ చేనేత సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిప్ప వెంకటేశ్వర్లు నేత, పద్మశాలి నాయకులు బేతి అశోక్ కుమార్ నేత, బైరి శ్యాంసుందర్ నేత, మార్గం ఎల్లయ్య నేత, ఆడెపు రవి నేత, దాసం రాజయ్య నేత పాల్గొన్నారు.

# 16న ధర్నాను జయప్రదం చేయండి

## ● ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దేశంలో రాష్ట్రంలో సంఘటిత, అసంఘటిత కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ఎంసీపీఐ (యూ), ఏఐసీ టీయూల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జరుగుతున్న ధర్నాలలో కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎంసీపీఐ(యూ) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి విడుదల చేసిన పత్రికా ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సంఘటిత రంగంలో ఉన్న కోట్ల మంది కార్మికవర్గం సృష్టించిన సంపదతో పెట్టుబడి దారులు బడా కార్పొరేట్ శక్తులుగా అభివృద్ధి అవుతూ ప్రపంచ కుబేరుల జాబితాలో చేరుతున్నారని, అదే ఉత్పత్తి సృష్టించిన కార్మికుడు మాత్రం చాలీచాలని వేతనాలతో పిల్లల విద్య, వైద్యం, వివాహం, ఇల్లు లాంటి కనీస సౌకర్యాలు లేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని, అదే విధంగా అసంఘటిత రంగంలోని కోట్లాది మంది కార్మిక వర్గం కూడా ఎలాంటి కనీస వేతనం లేక, కార్మిక సంక్షేమ బోర్డు లు లేక, పని గ్యారంటీ లేక అడ్డా మీది కూలీ పని, భవన నిర్మాణ రంగంలో, ఆటో కార్మికులుగా, షాప్ లలో వర్కర్స్ గా శ్రమ దోపిడికి గురైవుతూ ఉన్నారని అన్నారు. నేటి నూతన ఆర్థిక, పారిశ్రామిక, కార్పొరేట్ విధానాలతో కార్మికవర్గం నిలువు దోపిడికి గురైవుతున్నదని వస్తువు ఉత్పత్తి ద్వారా సంపద సృష్టించిన శ్రమజీవుల పోరాటాల ద్వారా వచ్చిన కార్మిక చట్టాలను రద్దు చేసి 4 కోడ్ లుగా తీసుకుని రావటం, అసంఘటిత కార్మిక వర్గం కోసం ఎలాంటి సమగ్ర చట్టాలు లేకుండా ఉండటాన్ని వ్యతిరేకంగా కనీస వేతన చట్టం అమలు చేయాలన్నారు. నాలుగు కోడ్ లను రద్దు చేసి గత కార్మిక చట్టాలను పునరుద్దరణ చేయాలని, జర్నలిస్టులను కూడా కార్మిక వర్గం గా గుర్తించి అమలు చేయాలని డిసెంబరు 16న జిల్లా కలెక్టర్ ఆఫీసుల ముందు ప్రదర్శనలు, ధర్నాలను జయప్రదం చేయాలని, సకల సంఘటిత, అసంఘటిత కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఎంసీపీఐ (యూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది.

# రెడ్ క్రాస్ ఉచిత ఆరోగ్య శిబిరం



**వరంగల్ వాయిస్, దామెర :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం హనుమకొండ జిల్లా దామెర మండలం లాదెళ్ల గ్రామంలోని గ్రామీణ ఆరోగ్య కేంద్రం లో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా చైర్మన్, పాలకవర్గం మాట్లాడుతూ లాదెళ్ల గ్రామంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించి బీపీ, షుగర్ రక్త పరీక్షలు నిర్వహించి 103 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.జె. కిషన్ రావు, డా.మొహమ్మద్ తయార్ మసూద్, రెడ్ క్రాస్ సిబ్బంది ఉపేందర్, శ్రీకాంత్, నర్సింహా చారి, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యే ప్రజా ప్రభుత్వం లక్ష్యం

## ➲ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, దామెర :** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వమని, ప్రభుత్వ సంక్షేమ గురుకుల పాఠశాలలకు పెద్ద పీట వేస్తుందని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు డైట్ అండ్ కాస్మోటిక్ చార్జీల పెంపు లాంచ్ కార్యక్రమాన్ని శనివారం దామెర మండలం ఒగ్లాపూర్ లోని సైలాన్ బాబా దర్గా సమీపంలోని మహాత్మ జ్యోతిరావు పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. నూతన డైట్, కాస్మోటిక్ లకు సంబంధించిన మెనూ ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం పాఠశాలలోనీ డైనింగ్ హాల్, ల్యాబ్, వంటగది, క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రభుత్వం అందిస్తున్న నూతన దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెంచిన డైట్, కాస్మోటిక్ చార్జీల వివరాలను తెలిపేలా బ్యానర్లను ప్రతి గురుకుల హాస్టల్ లో తప్పనిసరిగా ఏర్పాటు చేయాలనీ, మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు. ప్రతి గురుకుల, విద్యాసంస్థ పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పెంచిన డైట్ చార్జీలకు అనుగుణంగా విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన పౌష్టిక ఆహారాన్ని తప్పనిసరిగా అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ సంక్షేమ గురుకుల పాఠశాలలకు పెద్ద పీట వేస్తుందని, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేసి,విద్యార్థులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని, ఉపాధ్యాయులు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ప్రకాశ్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పోలేపాక శ్రీనివాస్, మార్కెట్ డైరెక్టర్ శంకర్, జిల్లా నాయకులు గుడిపాటి శ్రీధర్ రెడ్డి, రవీందర్, మండల యూత్ అధ్యక్షులు నల్ల సుధాకర్, నంద్యాల శ్రావణ్ రెడ్డి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యగిరి స్వామి దేవాలయాన్ని దర్శించుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలోని అతి పురాతనమైన ఆరు శతాబ్దాలు చరిత్ర గలిగిన శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయాన్ని పరకాల మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఆయనకు దేవాలయ చైర్మన్ సామల భిక్షపతి స్వామివారి శేష వస్త్రంతో సన్మానించారు. దేవాలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి మాట్లాడుతూ శ్రీ మత్స్యగిరి స్వామి చాలా మహిమగల దేవుడని దేవాలయాన్ని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు.

# చిప్ప వెంకటేశ్వర్లకు సత్కారం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అఖిల భారత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు డాక్టర్ లయన్ ఆడెపు రవీందర్ నేత ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫెల్లోషిప్ జాతీయ అవార్డు అందుకున్న వరంగల్ జిల్లా 23 డివిజన్ కు చెందిన టీపీసీసీ రాష్ట్ర చేనేత సెల్ ఉపాధ్యక్షుడు చిప్ప వెంకటేశ్వర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి వరంగల్ జిల్లాల కోఆర్డినేటర్ వోడ్నాల నరేందర్ నేత, పద్మశాలి సంఘం నాయకులు బైరి శ్యాంసుందర్ నేత, బేతి అశోక్ కుమార్ నేత, మార్గం ఎల్లయ్య నేత, 23వ డివిజన్ అఖిల భారత పద్మశాలి సంఘం ప్రెసిడెంట్ మంత్రి కమలాకర్ నేత పాల్గొన్నారు.

# ఘనంగా టీపీఎల్ ఎలక్ట్రానిక్స్ షోరూమ్ ప్రారంభం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలో స్థానిక మూడు కోట్ల సెంటర్ దారిలో టీపీఎల్ ఎలక్ట్రానిక్స్ షోరూమ్ ను శనివారం సీనియర్ రాజకీయ నేత నాతి కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్స్ షోరూం మేనేజింగ్ డైరెక్టర్ ప్రదీప్, వారి సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. టీపీఎల్ ఎలక్ట్రానిక్స్ షోరూం మేనేజింగ్ డైరెక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా తమ టీపీఎల్ ఎలక్ట్రానిక్స్ మహబూబాబాద్ జిల్లా ప్రజలకు చక్కటి సర్వీస్, సేల్స్ ఇచ్చి అందరికీ సుపరిచితమేనన్నారు. ఇంతకాలం కేవలం ఎల్ఈడీ ఎల్సీడీలను అందించిన మా సంస్థ ఇప్పుడు వాటర్ ప్యూరిఫైయర్, ఫ్రిడ్జ్, వాషింగ్ మెషిన్, సౌండ్ బాక్స్ లు, ఇన్వర్టర్లు, ఇంకా వ్యవసాయ యంత్ర పరికరాలను సైతం తమ షోరూంలో అందుబాటులోకి తేవడం జరిగిందని తెలిపారు. మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకొని సరసమైన ధరలలో అందిస్తున్నామన్నారు. తమ సేవలను గుర్తించి సహకరిస్తున్న మహబూబాబాద్ జిల్లా ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇకముందు కూడా తమ నాణ్యమైన ఎలక్ట్రానిక్స్ ఐటమ్స్ తో, ఇరవై నాలుగు గంటలు అందుబాటులో ఉండే మా అనుభవం కలిగిన టెక్నిషియన్స్ తో తమ సేవలు విస్తృత పరుస్తున్నామని, అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెక్నిషియన్స్ విజయ్, ప్రశాంత్, రాజమల్లు, నరేష్, అనిల్, యాకన్న, వర్షిత్, ఆదర్శ్, సంహిత్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ తల్లి విగ్రహంపై విమర్శలు మానుకోవాలి

## జిల్లా కాంగ్రెస్ నేత సాయిలి ప్రభాకర్



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** తెలంగాణ తల్లి విగ్రహంపై బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, కేటీఆర్, హరీష్ రావులు పదే పదే పనిగట్టుకొని విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. రాష్ట్ర ప్రజల మనోభావాలు ప్రతిబింబించే విధంగా సగటు శ్రామిక మహిళా రూపంలో ఉంది. సహజమైన ఒక మట్టి తల్లి తెలంగాణ తల్లి చూడగానే నా తల్లి అని కనెక్ట్ అయ్యే విధంగా కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి, క్యాబినెట్ అసెంబ్లీలో ఆమోదించి అధికారికంగా తెలంగాణ తల్లిని ఏర్పాటు చేశారు. ఇలాంటి సాంప్రదాయంగా ఉన్న తెలంగాణ తల్లిని అవమానిస్తారా అని ప్రశ్నించారు. మొత్తం బతుకమ్మను కవితే కనిపెట్టినట్టుగా మాట్లాడడం సరైనది కాదన్నారు. బతుకమ్మ అనేది తెలంగాణ సంప్రదాయమైన పండుగ బతుకమ్మను, తెలంగాణ అమ్మను, సాంప్రదాయాన్ని కాంగ్రెస్ పార్టీ గౌరవిస్తుంది. పదే పదే తెలంగాణ తల్లిని వాడుకోవాలని చూస్తున్న బీఆర్ఎస్ తీరును ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ పేరును మార్చి భారత రాష్ట్ర సమితి అని పేరు మార్చిన నాడే తెలంగాణ తల్లి గురించి మాట్లాడే హక్కును మీరు కోల్పోయారని ప్రభాకర్ పేర్కొన్నారు.

# బాసాని చంద్రప్రకాష్ కు అభినందనల వెల్లువ



**వరంగల్ వాయిస్, శాయంపేట :** శాయంపేట గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాష్ తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డ్ మెంబర్ గా నియమించబడ్డారు. శనివారం వరంగల్ లోని తన స్వగృహంలో చంద్ర ప్రకాష్ ను కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ మారపల్లి రవీందర్, మాజీ చైర్మన్ పోలపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ చల్లా చక్రపాణి, నాయకులు చిందం రవి, బాసాని మార్కండేయ, రంగు బాబు పాల్గొన్నారు.

# శ్రమజీవుల హక్కులను హరిస్తున్న కేంద్రం

## ● 16న కలెక్టర్ ఎదుట ధర్నా



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్న కార్మిక హక్కులను హరిస్తూ వత్తాసు పలుకుతున్నారని ఏఐసీటీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నర్ర ప్రతాప్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు జగదీశ్వర్ అన్నారు. అఖిల భారత కార్మిక సంఘాల కేంద్రం( ఏఐసీటీయూ) వరంగల్ నగర ముఖ్య కార్యకర్తల సమావేశం రాయినేని ఐలయ్య అధ్యక్షతన వరంగల్ ఓంకార్ భవన్ లో జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఎన్నో పోరాటాలు త్యాగాలతో సాధించుకున్న కార్మికుల హక్కులను కాలరాశి మొత్తం కార్మిక చట్టాలను మార్చి 4 నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చి కార్మికుల శ్రమను నిర్బంధంగా దోపిడి చేసే విధానాలకు పాల్పడుతున్నదన్నారు. దీంతో అసంఘటిత రంగ కార్మికుల పరిస్థితి మరింత అయోమయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు ఉత్పత్తి ఖర్చులు పెంచి రైతులు వ్యవసాయం చేయలేక దివాలా తీయించి రోజువారి కూలీలుగా, కార్మికులుగా మారుతుంటే పట్టించుకోకుండా మరోవైపు కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా చేసే కుట్రకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఐక్యతతో పాలకుల వినాశకర విధానాలకు వ్యతిరేకంగా రైతులు, కూలీలు, కార్మికులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా ఈనెల 16న జిల్లా కలెక్టర్ ఆఫీసుల వద్ద జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని కోరారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వాలు లేబర్ కోడులను రద్దుచేసి కార్మికులకు కనీస వేతనం రూ.25000 వేలు నిర్ణయించాలని అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కార్మిక హక్కులను కాపాడాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన ఉద్యమాలను ఉధృతం హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా నగర నాయకులు ఐతమ్ నగేష్, ఎగ్గని మల్లికార్జున్, నరసయ్య, నలివెల రవి తదితరులు పాల్గొన్నారు.

# వీరన్న కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలి

- ప్రిన్సిపాల్ సురేందర్ ను సస్పెండ్ చేయాలి
- ఎల్ హెచ్ పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్ నాయక్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అశోక్ నగర్ సైనిక్ స్కూల్ పీడీగా పని చేస్తూ విద్యార్థులకు చెస్ పోటీలకు అదిలాబాద్ తీసుకెళ్తున్న సమయంలో వరంగల్ లో ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మరణించడం జరిగింది. ఆర్ సీఓ డీవిస్ వెంకన్న స్పందించి గిరిజన కుటుంబానికి న్యాయం జరిగే విధంగా చూడాలని కోరారు. మహబూబాబాద్ జిల్లా మల్యాల గ్రామానికి చెందిన గుగులోతూ వీరన్న నాయక్ గత కొన్ని సంవత్సరాలుగా అశోక్ నగర్ సైనిక్ స్కూల్ లో పీడీగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో పిల్లలకు చేస్ పోటీలో పాల్గొనడానికి అదిలాబాద్ వెళ్తుండగా, వరంగల్ రైల్వేస్టేషన్ లో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు రైలు ఢీకొని డ్యూటీలో మరణించిన వీరన్న కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్ గ్రేషియాతో పాటు కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. రైల్వే సీఐ సురేందర్ తెలిపిన వివరాలు ప్రకారం అశోక్ నగర్ సైనిక్ స్కూల్ కు చెందిన ముగ్గురు విద్యార్థులను తీసుకొని పీటిగా పనిచేస్తున్న వీరన్న నాయక్, ఆదిలాబాద్ లో శనివారం నుంచి ప్రారంభమయ్యే రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలలో పాల్గొనేందుకు బయలుదేరారు. శుక్రవారం రాత్రి వరంగల్ రైల్వే స్టేషన్ కు చేరుకున్నారు. ఈ క్రమంలో విద్యార్థులను రైల్వేస్టేషన్ లో కూర్చోబెట్టి మూత్ర విసర్జన కోసమని వీరన్న ప్లాట్ ఫారం చివరికి వెళ్లాడు. అదే సమయంలో తిరుపతి నుంచి అదిలాబాద్ వెళ్లే కృష్ణ ఎక్స్ ప్రెస్ ప్లాట్ ఫామ్ పైకి వస్తున్న క్రమంలో వీరన్న పట్టలు దాటుతున్నంగా ఢీకొని అక్కడికి అక్కడే మృతి చెందారు. డ్యూటీలో ఉంటూ విద్యార్థుల కోసం కృషి చేస్తూ, తన విధులను సక్రమంగా నిర్వహించడంలో వీరన్న నెంబర్ వన్ అని, అలాంటి వీరన్న చనిపోవడం చాలా బాధాకరమని దిగ్భ్రాంతికి గురయ్యారు. వీరన్న కుటుంబంలో ముగ్గురు ఆడపిల్లలు, ఒక అబ్బాయి ఉన్నారని, అన్ని తానే చూసుకుంటున్న వీరన్న లేకపోవడంతో కుటుంబం శోకసంద్రంలో నిండిపోయిందన్నారు. కాబట్టి, తక్షణమే ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ నాయక్, అఖిల్ నాయక్, సందీప్, నాగరాజు, చిరంజీవి, నరేందర్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మానవాళి మనుగడ–సైకాలజీ పాత్ర




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అడ్వాన్స్ సైకాలజీ సర్వీస్ అసోసియేషన్ కార్యక్రమం డీఎండి యూనివర్సిటీ చైతన్య డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ కిషన్ పూర్ లో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అథితులుగా ఖాజాపురం దామోదర్, పాలడుగుల సురేందర్, హైదరాబాద్ ఏపీఐ ప్రెసిడెంట్ సైకాలజీ సర్వీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మోహన్ దాస్ పాండ్య హాజరయ్యారు. ప్రపంచంలో మానవాళి మనుగడ– సైకాలజీ పాత్ర అనే అంశంపై సైకాలజిస్ట్ ల సంఘాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ అసోసియేషన్ కు ప్రెసిడెంట్ గా డాక్టర్ పరికి సుధాకర్ ను, వైస్ ప్రెసిడెంట్ గా రామోజీరావు, సెక్రెటరీ గా శీతల మేడం గారు ఈసీ మెంబర్గా కృష్ణవేణి గారు దయాకర్ కాసుల రజిత, శివను ఎంపిక చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో దామోదర్ అంశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ సైకాలజీలు పిల్లల శ్రేయస్సుకు, మనోభావాలు మీద తల్లిదండ్రుల పాత్ర కూడా ఉంటుందని సూచించారు. పాలడుగుల సురేందర్ మాట్లాడుతూ పలు కార్యక్రమాలకు దయనియ జీవితంలో సైకాలజీ పాత్ర చాలా ముఖ్యమైందన్నారు. ఫ్యామిలీ కౌన్సిలింగ్ పిల్లల కౌన్సిలింగ్ పాఠశాలల్లో కూడా పిల్లలపై జరుగుతున్నఅఘాయిత్యాలు, లవ్ ఎలిమెంట్స్ గురించి కూడా తెలియపరిచారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మోహన్ దాస్ పాండ్య కమిటీని ప్రకటించి వారు సైకాలజీ ముఖ్యపాత్రను గురించి తెలియపరిచారు. రామోజీరావు మాట్లాడుతూ బ్రెయిన్ మెంటల్ ఎబిలిటీ గురించి సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జ్యోతి, శివ, శ్యామ్, దయాకర్, శ్రీకాంత్, సాయి కీర్తి, డాక్టర్ వైష్ణవి, శీతల్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్య అతిథులను సత్కరించడం జరిగింది.

# పౌష్టికాహార మెనూ ప్రారంభం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ ,మైనార్టీ మరియు తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ వసతి గృహాల విద్యార్థినీ విద్యార్థుల కోసం నూతనంగా ప్రవేశపెట్టిన పౌష్టిక ఆహార మెనూను కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ వరంగల్ ఆదేశాలనుసారం ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు శనివారం బీసీ వెల్ఫేర్ బాలికల వసతిగృహం న్యూ శాయంపేటలో ప్రారంభించినారు. ఈ సమావేశంలో డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పౌష్టిక ఆహార డైట్ ను 40 శాతం అదనంగా, పిల్లల కాస్మోటిక్ అవసరాలను 200 శాతం పెంచడం జరిగిందని తెలిపారు. ఈ నూతనంగా సవరించిన డైట్ ను పిల్లలకు అందించి వారి శారీరక, మానసిక అభివృద్ధికి దోహదపడేటట్లు వసతి గృహ నిర్వాహకులు నిర్వహించాలని కోరారు. పిల్లలు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, సురక్షితమైన నీటిని, కలుషితం గాని ఆహారాన్ని తీసుకోవాలన్నారు. డిప్యూటీ డెమో అనిల్ కుమార్ మాట్లాడుతూ పర్సనాలిటీ డెవలప్ మెంట్, మానసిక ఒత్తిడి, విద్యకు సంబంధించిన మెలుకువలపైన వివరించారు. పేరెంట్స్ కమిటీ నుంచి వచ్చిన సరోజ మాట్లాడుతూ పిల్లలు సమయాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నతమైన స్థితికి చేరాలని కోరారు. హాస్టల్ వెల్ఫేర్



ఆఫీసర్ కృష్ణవేణి, వసతి గృహ వంటశాలను, స్టోర్ రూములను, భోజనశాలను చూపించడం జరిగింది. పిల్లలకు అందిస్తున్న సేవల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడిస్తూ, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. విద్యార్థులతో కలిసి ఆహ్వానిత అధికారులు భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాంబశివరావు, డీఎంహెచ్ఓ వరంగల్, డాక్టర్ మోహన్ సింగ్ డిప్యూటీ డీఎంహెచ్ఓ వర్ధన్నపేట, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కృష్ణవేణి, విద్యార్థినిల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ పంచారామాల యాత్ర

**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల పరిధిలోని గ్రామాల భక్తుల సౌకర్యార్థం పరకాల డిపో నుంచి ఈనెల 19న పంచారామాలయాత్ర ప్రారంభమవుతుందని డిపో మేనేజర్ రవిచందర్ తెలిపారు. ఒకే రోజు పంచారామ క్షేత్రాలను దర్శించుకుంటే విశేషమైన ఫలితం కలుగుతుందన్న భక్తుల విశ్వాసం మేరకు అమరావతిలోని అమరేశ్వరాలయం, భీమవరం సోమేశ్వరాలయం, పాలకొల్లు క్షీర రామలింగేశ్వర ఆలయం, ద్రాక్షారామం భీమేశ్వరాలయం, సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయానికి పరకాల ఆర్టీసీ డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సులో యాత్ర ఉంటుందని తెలిపారు. యాత్రకు బస్సు టికెట్ ధర పెద్దలకు రూ.2300, పిల్లలకు రూ.1200 చొప్పున ఉంటుందని తెలిపారు. ఈనెల 19న సాయంత్రం ఐదు గంటలకు పరకాల నుంచి బస్సు ప్రారంభమై, 20న దర్శనం ఉంటుందని, తిరిగి 21 ఉదయం 9 గంటలకు పరకాలకు చేరుకుంటుందని తెలిపారు. ఆసక్తి గల యాత్రికులు పరకాల డిపో ట్రాఫిక్ ఇంచార్జి సూపర్డెంట్ కృష్ణకుమారి, బాబురావులను గానీ, పూర్తి సమాచారం కొరకు 966691910 నెంబర్ ను సంప్రదించాలని ఆయన కోరారు.

# బాధ్యతలు స్వీకరించిన ఎస్సై పరమేష్



**వరంగల్ వాయిస్, శాయంపేట :** శాయంపేట ఎస్సైగా పరమేష్ శనివారం బాధ్యతలను స్వీకరించారు. ఆత్మకూరు ఎస్సైగా పనిచేస్తున్న పరమేష్ బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ ప్రమోద్ కుమార్ సీసీఎస్ కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ పరమేష్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ కు సమస్యలపై ఫిర్యాదు చేయడానికి వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా ఉంటూ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.

# బీఎన్ఆర్ కేఎస్ శిక్షణ తరగతులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్టేషన్ ఘన్ పూర్ లో జరుగుతున్న బీఎన్ఆర్ కేఎస్ (భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం) రెండు రోజల శిక్షణ తరగతుల్లో హనుమకొండ జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎన్ఆర్ కేఎస్ రాష్ట్ర కార్యదర్శి, హనుమకొండ జిల్లా ఇంచార్జి పంకెర్ల కుమారస్వామి యాదవ్, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు చిక్కుడు రవీందర్, బుర్రి రాజేందర్, సత్తయ్య, ఏనూట్ల సదన్ రావు, శంకర్, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పసునూటి న్యూరో, మల్టీ స్పెషాలిటీ కేర్ డాక్టర్ గజ్జల అభిలాష్ ఆధ్వర్యంలో శనివారం ఖిలా వరంగల్ ఫోర్ట్ పడమటి కోట బొద్రాయి దగ్గర ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో హెల్త్ చెక్ అప్, బీపీ షుగర్ లాంటివి పరీక్షలు నిర్వహించి మెడిసిన్ అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ గజ్జల అభిలాష్ మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిచడమే మా లక్ష్యమన్నారు. దాదాపు 200 మంది పెషేంట్లను చూడడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయిలో ఛాంపియన్లుగా నిలవాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** క్రికెట్ క్రీడాకారులందరూ రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న టోర్నమెంట్ లో ఛాంపియన్ షిప్ సాధించటానికి కష్ట పడి ఆడాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. శనివారం కరీమాబాద్ లోని రామస్వామి దేవాలయ గ్రౌండ్ లో ఓల్డ్ క్లాసిక్ క్లబ్ కరీమాబాద్ చైర్మన్ సమి అక్మల్ ప్రెసిడెంట్ మీరిపెల్లి వినయ్ ఆధ్వర్యంలో గత 18 రోజుల నుంచి జరుగుతున్న సీపీఎల్–5 తెలంగాణ స్టేట్ లెవల్ క్రికెట్ టోర్నమెంట్ కు ముఖ్య అతిథిగా కార్పొరేటర్ మరుపల్ల రవి విచ్చేసి సెమీ ఫైనల్ మ్యాచ్ ను ప్రారంభించారు. ఈ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ లో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నందుకు నిర్వాహకులు అయిన సమి అక్మల్ మీరిపెల్లి వినయ్ లను కార్పొరేటర్ మరుపల్ల రవి అభినందించారు.

## ఆపదలో 'స్నేహ' హస్తం



**వరంగల్ వాయిస్, దామెర :** తమతో పాటు చదువుకున్న స్నేహితుడి కుటుంబానికి 1994–95 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆపదలో అండగా నిలిచారు. హనుమకొండ జిల్లా దామెర మండల కేంద్రానికి చెందిన రఘు అనివార్య కారణాలతో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న 1994–95 ఎస్ఎస్సీ బ్యాచ్ మిత్రులు తమ స్నేహితుడు రఘు కుటుంబానికి అండగా నిలవడానికి ముందుకు వచ్చారు. మిత్రులందరూ కలిసి శనివారం రఘు కుటుంబ సభ్యులకు టెన్త్ బ్యాచ్ తరపున మొత్తం రూ.86,500 అందజేసి మిత్రుని కుటుంబానికి మనో ధైర్యం ఇచ్చారు. కష్ట కాలంలో స్నేహితుడి కుటుంబానికి తోచిన సాయం చేసి అండగా నిలిచిన విద్యార్థులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మోహన్, శ్రీనివాస్, కుమారస్వామి, శివకుమార్, నగేష్, సుజయ్, రవి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే అభివృద్ధి

### కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రాంతం అభివృద్ధి చెందిందని, పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీలో గుర్తింపు ఉంటుందని, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్ అన్నారు. శనివారం రఘునాథపల్లి మండలం వత్తేశాపురం గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.గ్రామ నూతన కమిటీ అధ్యక్షుడిగా గాజుల పార్టీ వీరోజిని, ఉపాధ్యక్షులుగా పీడెం తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా కాసం శ్యాంసుందర్, కోశాధికారిగా పబ్బ వీరేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గొట్టం భాస్కర్ రెడ్డి, గాజులపాడి మహేందర్, సత్యనారాయణ, అహ్మద్, గుట్టం కరుణాకర్ రెడ్డి, గాజులపాటి నేతాజీ, తదితరులు పాల్గొన్నారు.

# గౌడ జనుల ఐక్యతకు గోపా ముందుండాలి

### ➲ జిల్లా అధ్యక్షుడిగా ఆంజనేయులు గౌడ్




**వరంగల్ వాయిస్, జనగామ :** రాజ్యాధికార సాధన లక్ష్యసాధనకు శ్రమిస్తున్న బహుజనుల భాగస్వామి గౌడ సమాజం ఐక్యతకు గోపా ముందుండి నడిపించాలని గోపా నాయకులు కోరారు. శనివారం ఉదయం స్థానిక కెమిస్ట్స్ భవన్ లో జరిగిన గోపా జనగామ జిల్లా అధ్యక్షుడు మేకపోతుల ఆంజనేయులు గౌడ్ అధ్యక్షతన జరిగిన సర్వ సభ్య సమావేశంలో పాల్గొన్న గోపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుర్రేముల యాదగిరి, చెక్కిళ్ల మధుసూదన్ గౌడ్, వ్యవస్థాపక అధ్యక్షుడు కన్న పరశురాములు గౌడ్ ప్రసంగించారు. జిల్లా లో ఇప్పటికే మండల కమిటీలు ఎన్నిక జరుపుకొని జిల్లా కమిటీని ఎన్నుకోవడం అభినందనీయమన్నారు. గత రెండు సంవత్సరాల కాలంలో జిల్లా కమిటీనిర్వహించిన కార్యక్రమాల నివేదికను కార్యదర్శి రాజబోస్ సమర్పించగా సభ్యులు కరతాళ ధ్వనులతో ఆమోదించారు. అనంతరం క్రింది వారితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రస్థుత అధ్యక్షుడు మెకపోతుల ఆంజనేయులు గౌడ్ తిరిగి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా బైరగోని శ్రీనివాస్, కోశాధికారిగా దూడల రాజసంపత్ గౌడ్ ఎన్నికయ్యారు. పలువురు పూర్వ అధ్యక్షులు సభ్యులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. అంబటి రాజయ్య, దూడల రమేష్, బి.చొక్కయ్య, బి.కృష్ణమూర్తి, వి.విజయ కుమార్, జి.రామకృష్ణ తదితరులు ప్రసంగించారు.

### గోపా జిల్లా నూతన కార్యవర్గం..

అధ్యక్షుడిగా మేకపోతుల ఆంజనేయులు గౌడ్, ప్రధాన కార్యదర్శిగా బైరగోని శ్రీనివాస్ గౌడ్, కోశాధికారిగా దూడల సంపత్ గౌడ్, ఉపాధ్యక్షులుగా గూడ రాజబోసు గౌడ్ ,మాచర్ల ప్రభాకర్ గౌడ్ ,బుడిగె కృష్ణమూర్తి గౌడ్, అంబటి అంజయ్య గౌడ్,బబ్బూరి శ్రీకాంత్ గౌడ్, కార్యదర్శులుగా దూరి ఉపేందర్ గౌడ్ ,కొయ్యడ శ్రీరామ్ గౌడ్ ,మాచర్ల బాలరాజు గౌడ్, ఓడపల్లి అశోక్ గౌడ్, సహాయ కార్యదర్శులుగా మాచర్ల చంద్రమౌళి గౌడ్, వనమోయిన వెంకన్న గౌడ్, కుర్రేముల మోహన్ గౌడ్, తాళ్లపల్లి బాబు గౌడ్, కుర్ర సురేందర్ గౌడ్, కార్యవర్గ సభ్యులుగా తొలుపునూరి రామచంద్రంగౌడ్, బిక్కి రవీందర్ గౌడ్, తోట మల్లేష్ గౌడ్, వెలిశాల రాం నర్సయ్య గౌడ్, బత్తిని చొక్కయ్య గౌడ్, నర్మెట కృష్ణ గౌడ్, గౌరవ సలహాదారులుగా తీగ సిద్ధిమల్లయ్య గౌడ్, అంబటి రాజయ్య గౌడ్, మాచర్ల రాములు గౌడ్, దూడల రమేష్ గౌడ్, వగలబోయిన విజయ్ కుమార్ గౌడ్, మడిపల్లి ఐలయ్య గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## విద్యార్థులకు సమతుల ఆహారం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్రంలోని అన్ని సమక్షేమ వసతి గృహాలలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యూనిఫామ్ డైట్ ప్రారంభోత్సవంలో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం హనుమకొండ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎ.అప్పయ్య ఎస్సీ జూనియర్ కాలేజ్ హాస్టల్ టీవీ టవర్ హనుమకొండ కు ముఖ్య అతిథిగా ఎల్కతుర్తి ఎంపీడీవోతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం పిల్లల సంక్షేమం ఆలోచించి 40 శాతం డైట్ చార్జెస్ పెంచిందని, దీంతో సమతుల ఆహారం అంది, పిల్లలు మాల్ న్యూట్రిషన్ కు, రక్తహీనతకు గురికాకుండా ఉండి చదువుల పట్ల శ్రద్ధ వహించగలరని చెప్పారు. అదేవిధంగా ప్రపంచంలో దొంగలించబడనిది విద్య కాబట్టి శ్రద్ధతో చదివి ఉన్నత పౌరులుగా తయారు కావాలని సూచించారు. తర్వాత ముగ్గురు విద్యార్థులతో ఆదిత్య ఐటీఐ, సాయి కిరణ్ ఎంబీఏ లతో కూడా మాట్లాడిపించారు. పిల్లలతో కలిసి భోజనం చేయడం జరిగింది. వంటగదిని పరిశీలించి వంటలు చేసి వడ్డించే వారికి ఆహార నియమాలను బోధించడం జరిగింది. పిల్లలకు అవుట్ డోర్ గేమ్స్ కు సరిపోయినంత ప్లే గ్రౌండ్ లేకపోవడం గమనించిన డీఎంహెచ్ఓ వారికి క్యారం బోర్డ్, చెస్ బోర్డుని బహూకరించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫీసర్ రవికుమార్, ఎల్కతుర్తి ఎంపీడీవో విజయ్ కుమార్, వడ్డేపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పాల్గొన్నారు

## ప్రజా ఆరోగ్యానికే తొలి ప్రాధాన్యం



**వరంగల్ వాయిస్, తొర్రూర్ :** పట్టణంలోని పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ ఏర్పాటుచేసిన నూతన గాంధీ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ప్రజల ఆరోగ్యానికే అధిక ప్రాధాన్యత అని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన స్వల్ప కాలంలోనే ప్రజల ఆరోగ్య దృష్ట్యా ఆరోగ్యశ్రీ సేవలను 10 లక్షలకు పెంచినట్టు తెలిపారు, తొర్రూరు పరిసరాల ప్రాంతాల ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా పట్టణంలో కోవిడ్ లాంటి విపత్తుల పరిస్థితులలో వైద్యుల పాత్ర చాలా గొప్పదన్నారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని హాస్పిటల్ నిర్వాహకులకు సూచించారు. ఝాన్సీ రెడ్డి వెంట స్థానిక నాయకులు, హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ గణేష్, మునిసిపల్ చైర్మన్ మంగలపెల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యా నాయక్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా రంగ సమస్యల పరిష్కారానికై చలో అసెంబ్లీ

### ▪ పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహరావు

### ▪ కేయూలో "వాల్ పోస్టర్స్" ఆవిష్కరణ




**వరంగల్ వాయిస్, కేయూ :** విద్యారంగం పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ, తక్షణమే విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్ యూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 17న నిర్వహించే "ఛలో అసెంబ్లీ" కార్యక్రమంలో విద్యార్థులంతా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహరావు పిలుపునిచ్చారు. శనివారం కాకతీయ యూనివర్సిటీలో పీడీఎస్ యూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ముద్రించిన "ఛలో అసెంబ్లీ" వాల్ పోస్టర్స్ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా బి.నరసింహరావు మాట్లాడుతూ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలన సంవత్సర కాలం పూర్తి చేసుకున్నప్పటికీ విద్యారంగ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని, నేటికీ విద్యారంగానికి కనీసం విద్యాశాఖ మంత్రిని కేటాయించలేదని, చిత్తశుద్ధితో రాష్ట్ర విద్య వ్యవస్థను గాడిన పెట్టే చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ రాష్ట్ర నాయకురాలు కావ్య, కాకతీయ యూనివర్సిటీ నాయకులు అనూష, సాధన, పృథ్వీరాజ్, పవన్ కళ్యాణ్, దుర్గాప్రసాద్, అరవింద్, కృష్ణ, నరేష్, రాజ్ కుమార్, సాయిచంద్ తదితరులు పాల్గొన్నారు.



# నువ్వు నాలో స్ఫూర్తిని నింపావు

## రానాకు సమంత బర్త్‌డే విషెస్

రానా దగ్గుబాటి పుట్టినరోజు సందర్భంగా అభిమానులు ఆయనకు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఇదే సమయంలో సినీ సెలబ్రిటీలు సైతం రానాకు విషెస్ తెలుపుతున్నారు. ఈ క్రమంలో స్టార్ నటి సమంత సైతం రానాకు ప్రత్యేకంగా బర్త్‌డే విషెస్ తెలియజేశారు. 'హ్యాపీ బర్త్ డే రానా. నువ్వు చేసే ప్రతి పనిలోనూ వంద శాతం ఫోకస్ పెడుతుంటావు. ఈ విషయంలో నీ నుంచి నేను ఎంతో స్ఫూర్తి పొందాను. నేను ఎప్పటికీ నీ అభిమానినే. దేవుడు ఆశీర్వాదులు నీకు ఎప్పుడూ ఉండాలి' అంటూ ఇన్‌స్టా వేదికగా పోస్టు పెట్టారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. కాగా, రానా ప్రస్తుతం సరికొత్త టాక్ షోతో ప్రేక్షకులను అలరిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే 'నం1 యారి' అంటూ ఓటీటీలో సందడి చేసిన రానా.. ఇప్పుడు 'ది రానా దగ్గుబాటి షో' అనే పేరుతో అభిమానులను అలరిస్తున్నాడు. ఈ షో ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లో నవంబర్ 23 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది.





# ఖైదీ నెంబర్ 7697

## జైలులో బన్నీ ఏం చేశాడంటే..?

సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట కేసులో నటుడు అల్లు అర్జున్ అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. శుక్రవారం అరెస్ట్ అవ్వడంతో చంచల్‌గుడా జైలుకు తరలించగా.. హైకోర్ట్ మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. అయితే విడుదలకు సంబంధించి ఫార్మాలిటీస్ పూర్తికాకపోవడంతో నైట్ అంతా జైలులోనే గడిపాడు అల్లు అర్జున్. అయితే జైలులో ఉన్న అల్లు అర్జున్‌కి అధికారులు ఎలాంటి వసతి కల్పించారు. బన్నీ ఎలా ఉన్నాడు అనే దానిపై ఆసక్తికర అంశాలు వెలుగుచూశాయి. అల్లు అర్జున్‌ని చంచల్‌గుడాలోని వీఐపీ బ్లాక్ ఉంచినట్లు తెలుస్తుంది. ఇక జైలులో ఉన్న అల్లు అర్జున్‌కు అండర్ ట్రయల్ ఖైదీగా యూటీ 7697 నంబర్‌ను అధికారులు కేటాయించారు. రాత్రంతా మంజీరా బ్యారక్‌లోని బ్లాక్ –1లో అల్లు అర్జున్‌ని ఉంచగా.. తెల్లవారేవరకు అల్లు అర్జున్ నిద్రపోకుండానే గడిపినట్లు తెలుస్తుంది. అల్లు అర్జున్ పడుకునే ముందు జైలు సిబ్బంది రగ్గు దుప్పటి ఇచ్చినట్లు సమాచారం. అయితే వీటిని తిరస్కరించి అల్లు అర్జున్ నేలపైనే పడుకున్నట్లు.. ఇక జైలులో ఉన్నంత సేపు అధికారులతో తప్ప ఎవరితో బన్నీ మాట్లాడలేదని తెలుస్తుంది. రాత్రి జైలులో అధికారులు భోజనం అందించగా.. కొంచెం తిని పక్కన పెట్టినట్లు తెలుస్తుంది. ఉదయం 5.45 గంటలకు బన్నీని జైలు నుంచి బయటకు తీసుకువచ్చి.. విడుదలకు సంబంధించి ఫార్మాలిటీస్ పూర్తిచేసినట్లు.. ఉదయం 6.39 గంటలకు విడుదల చేసినట్లు సమచారం.

### ఆమె లోటు ఎవరూ పూడ్చలేనిది

ఉదయమే మీడియాతో మాట్లాడిన అల్లు అర్జున్ తాజాగా మరోసారి మీడియా ముందుకు వచ్చాడు. ఈ సందర్భంగా తనకు అండగా నిలిచిన అభిమానులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. బాధిత కుటుంబానికి జరిగిన నష్టం పూడ్చలేనిది. ఆ కుటుంబానికి మరోసారి నా క్షమాపణలతో పాటు సానుభూతి తెలుపుతున్నా. బాధిత కుటుంబానికి ఎల్లప్పుడు అండగా ఉంటాను. అంటూ అల్లు అర్జున్ చెప్పుకోచ్చాడు.



### ఎమోషనల్ అయిన చిరంజీవి భార్య

ఈ సందర్భంగా బన్నిని పరామర్శించేందుకు సినీ సెలబ్రిటీలు అల్లు నివాసానికి చేరుకుంటున్నారు. ఈ క్రమంలోనే అక్కడకి చేరుకున్న అల్లు అర్జున్ మేనత్త, చిరంజీవి భార్య సురేఖ అల్లు అర్జున్‌ను చూసి భావోద్వేగానికి గురైంది. అల్లు అర్జున్ కూడా మేనత్తని చూసి దగ్గరికి వెళ్లి హాగ్ చేసుకున్నాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

### స్పందించిన సినీలోకం..

సినిమా వాళ్లకు సంబంధించిన ఏ విషయంలోనైనా ప్రభుత్వ అధికారులు, మీడియా చూపించే అత్యుత్సాహం సాధారణ పౌరుల రక్షణలో కూడా చూపించాలని కోరుకుంటున్నా. మనం మంచి సమాజంలో జీవించాలి. ఇదొక దురదృష్టకర ఘటన. దీని నుంచి మనం ఎన్నో పాఠాలు నేర్చుకోవాలి. ఇకపై మరిన్ని జాగ్రత్తలు పాటించి భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలి. ఇక్కడ మనందరి తప్పు ఉంది. ఒక వ్యక్తిని నిందించడం కరెక్ట్ కాదు.

### నమ్మలేక పోతున్నా : - నాని

ప్రస్తుతం జరుగుతున్నది నమ్మలేక పోతున్నా. జరిగిన సంఘటన దురదృష్టకరం, చాలా బాధాకరం. అయితే, తప్పంతా ఒక వ్యక్తిపైకి నెట్టడం సమంజసం కాదు.

### బాధాకరం : - రష్మిక

సంధ్యా థియేటర్ వద్ద జరిగిన ఘటన బాధాకరం. మరిన్ని జాగ్రతలు తీసుకుని ఉండాల్సింది. ఈ ఘటనకు అల్లు అర్జున్‌ని బాధ్యుడిగా చేయడం దారుణం. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలి.

### దురదృష్టకరం : - అనిల్ రావిపూడి

థియేటర్ వద్ద ఘటన దురదృష్టకరం. ఒక తల్లి ఆ రోజు ప్రాణాలు కోల్పోయింది. కానీ ఈ రోజు అల్లు అర్జున్ పట్ల జరిగింది మాత్రం చాలా కఠినమైన చర్య.

### అన్యాయం : - అడవి శేష్

ఈ ఘటన బాధాకరం. భద్రతాపరమైన, ఇతర అంశాలను నటీనటులు ఒక్కరే చూసుకోలేరు. జాగ్రత్తగా ఉండాలని మాత్రమే వాళ్లు చుట్టు పక్కల వారికి సూచిస్తుంటారు. ఒక వ్యక్తిని మాత్రమే నిందించడం అన్యాయం.

### జవాబు చెప్పాలి : - వరుణ్ ధావన్

అల్లు అర్జున్ ఏమైనా టెర్రరిస్టా? ఇంట్లోకి దూరి అరెస్ట్ చేయడం ఏమిటి? ఈ అరెస్టుపై రేవంత్ రెడ్డి అందరికీ జవాబు చెప్పాలి.

### సర్వనాశనం అవుతారు

ప్రముఖ రచయిన చిన్నికృష్ణ సంచలన కామెంట్ అల్లు అర్జున్‌కు మరక అంటించాలని చుసిన ఏ నాయకుడు అయినా, ఏ ప్రభుత్వం అయినా సర్వనాశనం అయిపోతారని ఆగ్రహం వ్యక్తం చేశాడు. అల్లు అర్జున్ వెనకాల చిరంజీవి అనే ఒక మహా శక్తి ఉంది అంటూ చిన్ని కృష్ణ తెలిపాడు.

### ముమ్మాటికీ రాజకీయమే : పూనమ్ కపూర్

ఈ హడావిడిలో పూనమ్ కౌర్ కూడా కొన్ని సెటైర్లు వేసింది. అల్లు అర్జున్ ఫోటోలను షేర్ చేస్తూ.. నా ఫేవరేట్ హీరో అని చెప్పింది. ఇందులో అధికారాన్ని దుర్వినియోగం చేయడమే రాజకీయం.. ఆ అధికారాన్ని ప్రజల అభివృద్ధికి వాడటమే నాయకత్వం అంటూ కౌంటర్ వేసింది. అంటే రేవంత్ రెడ్డి తన పవర్‌ను మిస్ యూజ్ చేస్తున్నాడని, రాజకీయాలు చేస్తున్నాడని పూనమ్ కౌర్ చెప్పకనే చెబుతూ కౌంటర్లు వేసింది. అల్లు అర్జున్ మాత్రం బయటకు వచ్చి మీడియాతో మాట్లాడుతూ.. చట్టపరిధిలో ఈ కేసు ఉందని, భారత న్యాయ వ్యవస్థ మీద తనకు పూర్తి నమ్మకం ఉందని, ఈ కేసు గురించి తాను బయట మాట్లాడను అని చెప్పేసి వెళ్లిపోయాడు.



# మీ తప్పు లేదు

## మీడియా ఘటనలో మంచు మనోజ్

మంచు ఫ్యామిలీలో జరుగుతున్న గొడవల నేపథ్యంలో సినీ నటుడు మంచు మోహన్ బాబు జర్నలిస్ట్‌పై దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడి ఘటనలో జర్నలిస్ట్‌కు తీవ్రగాయాలు కాగా.. మోహన్ బాబు క్షమాపణలు చెప్పాలి అంటూ జర్నలిస్ట్ సంఘాలు అన్నీ ధర్నా చేయడం మొదలు పెట్టాయి. ఇప్పటికే ఈ ఘటనకు సంబంధించి మోహన్ బాబు క్షమాపణలు తెలుపగా.. తాజాగా ఈ విషయంపై నటుడు మంచు మనోజ్ స్పందించాడు. ఈ ఘటనలో మీడియా తప్పు లేదు. నిస్సహాయ స్థితిలో నేను మీడియాను లోపలికి తీసుకువెళ్లాను. మా ఇంట్లోకి నన్ను అనుమతించకపోవడంతోనే మీడియా ప్రతినిధులను వెంటబెట్టుకుని తీసుకువెళ్లా. లోపలికి వెళ్లిన అనంతరం తనపై దాడి జరిగింది. ఈ ఘటనలో అసలు మీడియా తప్పు లేదు అంటూ మనోజ్ చెప్పుకోచ్చాడు.



8

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

శనివారం, డిసెంబర్ 14, 2024



# డైట్, కాస్మెటిక్ చార్జీలు పెంచిన ఘనత మాదే

- మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిల్ల శ్రీధర్ బాబు
- విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు

**వరంగల్ వాయిస్, గణపురం :** రాష్ట్రంలో అన్ని గురుకుల పాఠశాలల్లో డైట్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలు పెంచి విద్యార్థులకు రేవంత్ సర్కార్ ప్రయోజనం చేకూర్చిందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ప్రకటించారు. భూపాలపల్లి మండలంలోని గాంధీనగరం జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో శనివారం స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రులు పాల్గొని ప్రసంగించారు. తమ ప్రభుత్వం విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. గత సర్కార్ డైట్, కాస్మోటిక్ చార్జీలు ఒక్క రూపాయి కూడా పెంచలేదన్నారు. గురుకులాల్లో నాణ్యంగా భోజనం అందిచేలా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్లు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ కారే, డీఎస్పీ ఎ.సంపత్ రావు, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఎంపీడీవో ఎల్.భాస్కర్, కాంగ్రెస్ నాయకులు రాజేందర్, చోటే మియా, కె.శ్రీనివాస్, వి.అశోక్, కె.రామ్ రెడ్డి, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### మరిపెడలో..

**వరంగల్ వాయిస్, మరిపెడ :** రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సంక్షేమ హాస్టల్లలో ఒకే విధమైన డైట్ ప్లాన్ ఉండాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి శనివారం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ పెంచిన డైట్ ఛార్జీలలో భాగంగా రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ హాస్టలను అధికారులు, ఇతర ప్రజా ప్రతినిధులు వ్యక్తిగతంగా సందర్శించి, విద్యార్థులతో కలసి భోజనం చేసి పరిస్థితులను స్వయంగా అంచనా వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, అదనపు కలెక్టర్ కె.వీర బ్రహ్మచారి, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ కిరణ్ కుమార్, సంబంధిత జిల్లా అధికారులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### కాటారంలో..

**వరంగల్ వాయిస్, కాటారం :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఏకరూపత ఆహార ప్రణాళికతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం కాటారం, దామరకుంట గురుకులాల్లో పండుగ వాతావరణం నెలకొంది. కాటారంలోని బాలురు గిరిజన కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, గురుకుల అధికారి, ఓఎస్ డీ ఎల్.శ్రీనివాసులు నూతన మెనూ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.లాలు, వైస్ ప్రిన్సిపాల్ హెచ్ రాజేందర్, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ ఎం.మాధవి, డిప్యూటీ వార్డెన్ వెంకటరామిరెడ్డి, పీడీ మహేందర్, పీఈటీ శ్రీనివాస, కోచ్ వెంకటేష్, పేరెంట్స్ కమిటీ సభ్యులు శారద, రమాదేవి, సురేందర్, జాడి శ్రీశైలం, జ్యోతి, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు. దామెరకుంటలో ఎంపీఓ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థినిలతో సహపంక్తి భోజనం..

వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోని 42వ డివిజన్ రంగశాయిపేట బైపాస్ రోడ్డులోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఏకరీతి ఆహార ప్రణాళిక ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, గౌరవ అతిథి 42 వడివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్, ప్రత్యేక ఆహ్వానితులుగా వరంగల్ డీఈఓ జ్ఞానేశ్వర్, డీడీ అడల్ట్ ఎడ్యుకేషన్ శ్రీ ధనరాజు, మల్టీజోన్-1 ఆఫీసర్ అలివేలు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.రాధిక, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.మమత, అధ్యాపకబృందం, విద్యార్థినీలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.










### యాకుపురాలో..

తెలంగాణ గురుకుల పాఠశాల కళాశాల యాకుపురాలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ ఎస్ఈ కిషోర్, ఏడీ సాయి కృష్ణ, ఏజే మిల్స్ ఏఈ, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, కార్పొరేటర్ అనిల్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్, ప్రిన్సిపల్ రామ్మోహన్, సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ మధు తదితరులు హాజరై విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. డైట్ చార్జీలు పెంచినందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



# ముకుందా జ్యువలరీ ప్రారంభం

## ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన ముంకుందా జ్యువలరీని శనివారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని నీలిమ రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ వాణిజ్య, వ్యాపారాలకు హనుమకొండ నగరం వేదికగా నిలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన వివిధ వ్యాపార సంస్థలు హనుమకొండను కేంద్రంగా చేసుకొని తమ సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటున్నాయన్నారు. దీంతో ప్రజలకు నాణ్యమైన వస్తువులతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. ఈ సందర్భంగా ముంకుందా జూవెలరీ యాజమాన్యానికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముంకుందా జూవెలరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రేపే వైభవ లక్ష్మి షాపింగ్ మాల్ ప్రారంభం

## ఏర్పాట్లు చేస్తున్న యాజమాన్యం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నలుగురు యువకులు కలిసి వరంగల్ జేపీఎన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చసుకున్న వైభవ లక్ష్మి షాపింగ్ మాల్ ను ఆదివారం ఉదయం 11:19 గంటలకు శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రారంభించనున్నారు. ఈ మేరకు శనివారం షాపింగ్ మాల్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో డైరక్టర్లు వర్రి లలిత్, ప్రదీప్ కుమార్ బజాజ్, సూరజ్ సరడ, పి.రిషిత పాల్గొని వివరాలను వెల్లడించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్.నాగరాజ్, దొంతి మాధవ రెడ్డి, శాసన మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాష్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్ గాందే కల్పన తదితరులు ప్రారంబోత్సవ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు వెల్లడించారు. సరికొత్త సంప్రదాయ వస్త్రాలతో సకుటుంబం అంతా విచ్చేసి షాపింగ్ చేసే విధంగా సిల్క్, టెక్స్ టైల్స్, మెన్స్, ఉమెన్స్, ఎత్నిక్స్, కిడ్స్ వేర్ లను ప్రత్యేకమైన డిస్కౌంట్ లతో అందించనున్నట్లు వెల్లడించారు. ప్రారంబోత్సవ ఆఫర్ గా రూ.10వేల విలువ చేసే దుస్తుల కొనుగోలుపై బంగారు నాణెం అందిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా విద్యార్థులకు కొంచెమైనా తమ సాయం అందించాలన్న లక్ష్యంతో స్టూడెంట్స్ కోసం 10 శాతం స్పెషల్ డిస్కౌంట్ అందించనున్నట్లు తెలిపారు. ఇదే మా ఆహ్వానంగా భావించి పెద్ద సంఖ్యలో తరలి వచ్చి యువకులకు అండగా నిలువాలని కోరారు.

# ఘనంగా అయ్యప్ప పడిపూజ

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ నగరంలోని రైల్వే గేట్ శాంతినగర్ లో శనివారం కోరే కుమారస్వామి బ్రదర్స్ నివాసంలో గురు స్వామి వెల్దే ప్రదీప్ శాస్త్రి ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు 250 పైగా హాజరై అయ్యప్ప స్వామి పాటలు, భజనలతో హోరెత్తించారు. దీంతో రైల్వే గేట్ ప్రాంతం అంతా అయ్యప్ప నామస్మరణతో దద్దరిల్లింది. గురు స్వామి కొల్లూరి యోగానంద్ పాటలు పాడుతూ స్వాములను భక్తులను ఆకట్టుకున్నారు. అయ్యప్ప స్వామి విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో కోరే కుమారస్వామి, వెంకటస్వామి, రవీందర్, కంచ సారయ్య, కళ్యాణ్, కె.కుమారస్వామి, భాగ్యలక్ష్మి, కామ్లేష్, కనిష్క్, వేదా, కంచ సారయ్య, మండల రవి, గురుస్వామి కంచ మల్లయ్య, మండల నరసింహారాములు, కొంగొండి రమేష్, దుర్గి భార్గవ్, నంద రమేష్, అయ్యప్ప స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com